సాక్షి
నిజామాబాద్
శనివారం : 4 : జనవరి : 2025



ముడుపు విప్పేందుకు రండి

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కట్టిన ముడుపు విప్పడానికి రావాలని కాంగ్రెస్ నేతలు సీఎంను కోరారు.

- 10లో ▸



సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు వర్సిటీ పరిపాలన భవనాన్ని ముట్టడించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.4 /10.6

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేరాల నియంత్రణకు కృషి చేయాలి



ఖలీల్‌వాడి: నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ సిబ్బందికి సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలతో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. నేరాల నియంత్రణకు ప్రణాళికను రూపొందించుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి సారించాలని, కోర్టు కేసుల విషయంలో త్వరితగతిన స్పందించాలన్నారు. పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్ట పర్చాలని, నిఘా వ్యవస్థను ముమ్మరం చేయాలని సూచించారు. సమావేశంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) జి బస్వారెడ్డి, ప్రొబెషనరి ఐపీఎస్ సాయికిరణ్ పత్తిపాక తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై దాడిలో ఒళ్లంతా గాయాలు

- చర్మం లేచిపోయి, తల పగిలి ఇబ్బంది పడుతున్న బాధితుడు





ఇందల్వాయి : ఇందల్వాయి ఎస్సై మనోజ్ కుమార్ తనపై విక్షణా రహితంగా దాడి జరిపాడని నల్లవెల్లి గ్రామానికి చెందిన బాధితుడు మందుల లింగం 'సాక్షి'కి తెలిపారు. గత నెల 11న పోలీస్ స్టేషన్‌లోనే ఆధారాలు దొరకకుండా సీసీ కెమెరాలు ఆఫ్ చేసి మరీ చితకబాదినట్లు బాధితుడు పేర్కొన్నాడు. గ్రామంలో తాను అప్పు ఇచ్చిన వ్యక్తి సకాలంలో చెల్లించక పోవడంతో అతని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని డబ్బులు ఇచ్చి తీసుకువెళ్లమని చెప్పానని, అప్పు తీసుకున్న వ్యక్తి ఎస్సైని ఆశ్రయించాడని తెలిపాడు. ఎస్సై తనను పిలిపించి విచారణ జరపకుండానే తనపై దాడి చేసినట్లు లింగం ఆవేదన వ్యక్తం చేశాడు. ఎస్సై దాడిలో బాధితుడి తల, వీపు భాగంలో తీవ్రగాయాలయ్యాయి. చర్మం లేచిపోయి తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. విషయం ఎవరికైనా చెప్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎస్సై హెచ్చరించినట్లు బాధితుడు తెలిపాడు. అప్పు తీసుకున్న వ్యక్తి నుంచి డిసెంబర్ 20న రూ. 80 వేలు ఇప్పిస్తానని చెప్పిన ఎస్సై ఇంతవరకు ఇప్పించలేదన్నాడు. కాగా ఎస్సై దాడి సందర్భంగా బాధితుడు ఎదురు తిరిగాడని, దీంతో స్టేషన్‌లో గలాటా జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా లింగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సంతోష్ రెడ్డి ఇటీవల ఎస్సై మనోజ్ కుమార్ ఆగడాలపై ఐజీకి ఫిర్యాదు చేశారు. ఎస్సై సొంతంగా జేసీబీలతో లింగాపూర్, గౌరారం వాగుల నుంచి ఇసుకను రవాణా చేయిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి





మగ్గిడి లక్ష్మణ్, రాజమణి మృతదేహాలు

నవీపేట: కూలీ పనులు చేసుకొని ఇంటికి వస్తున్న దంపతులను మృత్యువు లారీ రూపంలో వచ్చి కబళించింది. నవీపేట మండలం ఫకీరాబాద్ గ్రామానికి చెందిన మగ్గిడి రాజమణి(50), మగ్గిడి లక్ష్మణ్(57) అబ్బాపూర్(ఎం)లో వరినాట్లకు కూలీలుగా శుక్రవారం వెళ్లారు. సాయంత్రం అక్కడే ఉండే తమ కుమార్తె తనూజ ఇంటికి వెళ్లి భోజనం చేశారు. తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా నవీపేట శివారులోని మిషన్ భగీరథ పంప్‌హౌస్ సమీపంలోని బాసర రహదారిపై ఎదురుగా వచ్చిన లారీ వీరిని ఢీకొంది. ఈ ఘటనలో వీరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు.

చెరుకు సాగే కీలకం

- నిజాం షుగర్స్ పునరుద్ధరణకు రైతుల సహకారం ప్రధానం
- నేడు ఎడపల్లిలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం
- ఇప్పటికే ప్రక్రియ నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక కమిటీ
- ప్రతి ఎన్నికల్లో చర్చనీయాంశంగా మారిన నిజాం షుగర్స్

నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. అయితే రైతులు గణనీయమైన స్థాయిలో చెరుకు పంట సాగుకు మొగ్గు చూపితేనే ఫ్యాక్టరీల పునఃప్రారంభానికి అడుగులు ముందుకు పడే పరిస్థితి నెలకొంది. ఈ ఫ్యాక్టరీలకు సంబంధించి రూ.400 కోట్ల బ్యాంకుల అప్పును రాష్ట్ర ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.190 కోట్లు చెల్లించింది. ప్రత్యేక కమిటీ విడతలవారీగా రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ వస్తోంది.



జిల్లాలోని ఎడపల్లిలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర షుగర్ కేన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ చెరుకు సాగు విషయమై రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. చెరుకు సాగుకు రైతులు ఏమేరకు ఆసక్తి కనబరుస్తున్నారనే వివరాలు సేకరించనున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాజకీయ పార్టీల గెలుపోటములను ప్రభావితం చేస్తూ వచ్చిన నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్‌ను తిరిగి ప్రారంభించే విషయంలో రైతుల సహకారం కీలకం కానుంది. రైతులు గణనీయమైన స్థాయిలో చెరుకు పంటను పండించేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తేనే షుగర్ ఫ్యాక్టరీల ప్రారంభం సాధ్యమయ్యే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో పునఃప్రారంభానికి అడుగులు మరింతగా పడాలంటే చెరుకు సాగు విస్తీర్ణమే ప్రధానం కానుంది. బోధన్ (ఉమ్మడి నిజామాబాద్), మంబోజిపల్లి (ఉమ్మడి మెదక్), ముత్యంపేట (ఉమ్మడి కరీంగనర్) జిల్లాల్లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీలను రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే తెరిపిస్తామని ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ సైతం ప్రకటించారు. అయితే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ప్రైవేటు యాజమాన్యం పరిధిలో ఉన్న ఈ ఫ్యాక్టరీలకు సంబంధించి రూ.400 కోట్ల బ్యాంకుల అప్పు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.190 కోట్లు చెల్లించింది. ఇప్పటికే ప్రత్యేక కమిటీ విడతలవారీగా రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా శనివారం

2002లో ప్రైవేటుకు విక్రయించిన చంద్రబాబు ప్రభుత్వం

నిజాం షుగర్స్ యూనిట్లను 2002 సంవత్సరంలో డెల్టా పేపర్ మిల్స్ అనే ప్రైవేటు కంపెనీకి చంద్రబాబు ప్రభుత్వం విక్రయించింది. 2014లో ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ నిజాం షుగర్స్‌ను ప్రభుత్వపరం చేస్తామన్నారు. అయితే 2015 డిసెంబర్ 23న ఫ్యాక్టరీ మూడు యూనిట్లు లేఆఫ్ ప్రకటించారు. 2005–06లో చెరుకు 35 వేల టన్నుల దిగుబడి ఉన్నప్పటికీ నడిపిన ఈ కర్మాగారాలను 2015లో ఒక లక్ష టన్నుల చెరుకు దిగుబడే ఉండగా మూసేయడం గమనార్హం. దీంతో రైతులు వరి పంట వైపు మళ్లారు. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలు ఉన్న బోధన్, ముత్యంపేట, మంబోజిపల్లి ప్రాంతాల్లో రైతులు గణనీయమైన విస్తీర్ణంలో చెరుకు పంట పండించేందుకు ముందుకు వస్తేనే ప్రభుత్వం ఫ్యాక్టరీల పునఃప్రారంభం విషయంలో మరింత వేగంగా ముందుకెళ్లే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రైతులు సాగు చేసే విషయమై ఆసక్తి నెలకొంది. ఫ్యాక్టరీలు ప్రారంభిస్తేనే ఈ ప్రాంతాల్లో ఎకానమీ పెరుగుతుందని, తద్వారా ఈ ప్రాంతాలకు పూర్వవైభవం వస్తుందని పలువురు అంటున్నారు. ప్రైవేటు రంగంలోనా ? ప్రభుత్వమా? లేక సహకార విధానంలో నడిపిస్తారా అనే విషయం కంటే.. అసలు ఫ్యాక్టరీలు ప్రారంభిస్తేనే అన్నిరకాలుగా అన్ని వర్గాలకు మేలు కలుగుతుందని జిల్లాలో అనేకమంది అభిప్రాయపడుతున్నారు.

యూరియా కోసం బారులు

ధర్పల్లి: ధర్పల్లి సొసైటీ పరిధిలోని దుబ్బాక గోదాం వద్ద రైతులు యూరియా బస్తాల కోసం శుక్రవారం ఉదయం బారులు తీరారు. కొన్ని రోజులుగా యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో సొసైటీ గోదాం వద్ద ఇస్తారని తెలియడంతో ఉదయమే చేరుకొని లైన్‌లో బండరాళ్లు, పట్టా పాస్‌బుక్‌లు పెట్టారు. యూరియా బస్తాలు దొరకక ప్రైవేట్ దుకాణాల్లో తెచ్చుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరతపై మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్‌ను వివరణ కోరగా.. దుబ్బాకలోని సొసైటీ గోదాంలో 40 టన్నుల యూరియాను శుక్రవారం పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలో యూరియా కొరత లేదన్నారు. ధర్పల్లి, రామడుగు, హోన్నాజిపేట్ సొసైటీల్లో యూరియా స్టాక్ ఉందని రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలని కోరారు.



దుబ్బాక సొసైటీ గోదాం వద్ద లైన్‌లో రాళ్లు, పట్టా పాస్‌బుక్‌లను ఉంచిన రైతులు

పడిపోయిన టమాట ధర

- హోల్‌సేల్‌లో కిలో రూ.6 పలుకుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు



మార్కెట్‌లో టమాటలు అమ్ముతున్న మహిళ

నిజామాబాద్ రూరల్: టమాట ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల క్రితం వరకు కిలో రూ.40 పలికిన టమాట ప్రస్తుతం రూ.10కి పడిపోయింది. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.ఆరుకే ఇస్తున్నారు. దీంతో టమాట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాట తెంపిన కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లోకి టమాట పంట ఒక్కసారిగా రావడంతో డిమాండ్ తగ్గి రేటు పడిపోయింది. నగరంలో 20 కిలోల బాక్స్‌ను రూ.120కి కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. వారు మార్కెట్‌లో కిలో రూ.8 నుంచి రూ.10వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఏమి మిగలడం లేదని వారు వాపోతున్నారు. కాగా ఫిబ్రవరి, మార్చిలో టమాటలకు డిమాండ్ ఉంటుందని వారు చెబుతున్నారు. అప్పుడు రేట్లు పెరిగే అవకాశం ఉందని ఆశిస్తున్నారు.

కూలీలకు కూడా సరిపోవడం లేదు

నేను ఐదు ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నాను. ప్రతిరోజు క్వింటాల్ 50 కిలో టమాటాలు ఉదయం బీట్‌కు పంపిస్తాను. ధర లేక టమాటాల తెంపే వారి కూలి కూడా రావడం లేదు. ఫిబ్రవరిలో టమాటా రేటు పుంజుకుంటుందని ఆశిస్తున్నాను.

– ఓబుల్ రెడ్డి, ధర్మారం

ఆదాయం తగ్గింది

నేను నిత్యం నగరంలోని గంజ్‌లో కూరగాయలు అమ్ముతా. ప్రస్తుతం టమాటలకు రేట్ లేక ఆదాయం రావడం లేదు. ఇతర కూరగాయలపై వచ్చే ఆదాయంతో సర్దుకుంటున్నాం. వచ్చే నెలలో రేట్ పెరిగే అవకాశం ఉంది.

– ప్రమీల, కూరగాయల వ్యాపారి

విధుల్లో క్రమశిక్షణ ముఖ్యం

- నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ
- బెటాలియన్‌లో ఘనంగా దీక్షాంత్ పరేడ్
- శిక్షణ పూర్తి చేసుకున్న 463 మంది కానిస్టేబుళ్లు





ఇన్‌చార్జి సీపీ సింధుశర్మకు గౌరవ వందనం చేస్తున్న శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు

డిచ్‌పల్లి: పోలీసు విధుల్లో క్రమశిక్షణ ముఖ్యమని నిజామాబాద్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధుశర్మ అన్నారు. డిచ్‌పల్లి మండలంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ శిక్షణ కేంద్రంలో తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 463 మంది కానిస్టేబుళ్లకు శుక్రవారం 'దీక్షాంత్ పరేడ్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బెస్ట్ ఫైరర్ (జి శివకృష్ణ), బెస్ట్ అవుట్ డోర్ అండ్ ఆల్ రౌండర్ (బి రవి), బెస్ట్ ఇండోర్ (కె నవీన్‌కుమార్ రెడ్డి), పరేడ్ కమాండర్ (జి నిరంజన్‌రెడ్డి)కు కమాండెంట్ సత్యనారాయణతో కలిసి బహుమతులు అందజేశారు. శిక్షణ అందించిన పోలీసు, వైద్య సిబ్బందికి ప్రశంసపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సింధుశర్మ మాట్లాడుతూ.. అంకితభావం, నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు. పోలీసు సేవలో ప్రతిఒక్కరూ అంతర్భాగమేనని, వ్యవస్థలో విజయం సాధించాలంటే కుటుంబ సభ్యుల సహకారం అవసరమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లలో రాచకొండ కమిషనరేట్, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఎంపికైన వారు ఉన్నట్లు తెలిపారు. పోలీస్ శాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బంది పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. కమాండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ.. 2002 లో బెటాలియన్ ట్రెనింగ్ సెంటర్‌గా గుర్తింపు పొందిందని తెలిపారు. ఇప్పటి వరకు 14 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేయడం గర్వకారణమన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆర్ఐ త్రిముఖ్ ఆధ్వర్యంలో 53 మంది అవుట్‌డోర్, ఆరు గురు ఇండోర్ ఫ్యాకల్టీ శిక్షణనిచ్చినట్లు తెలిపారు. అంతకుముందు ఇన్‌చార్జి సీపీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అసిస్టెంట్ కమాండెంట్స్ కేపీ శరత్‌కుమార్, కేపీ సత్యనారాయణ, ఏవో టి అయ్యవారయ్య, మెడికల్ ఆఫీసర్ అనుపమ పాల్గొన్నారు.



కుటుంబంతో కానిస్టేబుల్



కవాతు చేస్తున్న కానిస్టేబుళ్లు

నత్తనడకన పశుగణన

- సర్వేను జాప్యం చేస్తున్న పశువైద్య ఉద్యోగులు
- జిల్లాలో ఇప్పటి వరకు 35 శాతమే పూర్తి
- పేరుకే పర్యవేక్షకుల పాత్ర

డొంకేశ్వర్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన జిల్లాలో నత్తనడకన సాగుతోంది. రెండు నెలల క్రితం సర్వేను ప్రారంభించిన పశువైద్య ఉద్యోగులు ఇప్పటి వరకు కేవలం 35 శాతం మాత్రమే సర్వేను పూర్తి చేశారు. ఫిబ్రవరి 28నాటికి సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. రెండు నెలల్లో కనీసం 50శాతాన్ని అధిగమించకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. జిల్లాలో 31 మండలాల్లో 545 గ్రామ పంచాయతీలు ఉండగా 421 గ్రామ పంచాయతీల్లోనే పశుగణన సర్వే నడుస్తోంది. మిగతా గ్రామాల్లో ఇంకా ప్రారంభం కాలేదు. పశు గణన కోసం మొత్తం 109మంది ఎన్యుమరేటర్లను నియమించారు. సర్వేను పరిశీలించడానికి 23మంది పర్యవేక్షకులను నియమించినప్పటికీ పశుగణనలో వేగం కనిపించడం లేదు. పర్యవేక్షుల పాత్ర పేరుకే పరిమితమైంది. గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ తిరిగి చేయాల్సిన సర్వేను నిర్లక్ష్యం చేస్తున్న వారిపై ఉన్నతాధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంతో సర్వే మరింత జాప్యం అవుతోంది.

'పశుధన్' యాప్‌లో నమోదు

సంక్షేమ పథకాల రూపకల్పన చేయడానికి కేంద్ర ప్రభుత్వం పశు గణనను ప్రతీ ఐదేళ్లకోసారి నిర్వహిస్తోంది. దీని ద్వారా పశుపోషకుల ఆర్థిక పరిపుష్టిని అంచనా వేసేందుకు అవకాశం ఉంటుంది. చివరిసారిగా 201819లో సర్వే జరిగింది. 'పశుధన్' యాప్ ద్వారా ఆన్‌లైన్ సర్వే చేపట్టడం ఇదే మొదటి సారి. పెన్ను, పేపర్ లేకుండా ఫోన్ ద్వారా సర్వే చేస్తున్నప్పటికీ ఇందులో వేగం కనిపించడం లేదు.



నవీపేట్‌లో పశుగణనను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ జగన్నాథచారి


2018-19 సర్వే ప్రకారం జిల్లాలో పశువుల సంఖ్య

ఆవులు, ఎడ్లు	1,0,1252
గేదెలు	2,06,898
గొర్రెలు	7,03,012
మేకలు	1,05,089

ఈ పశుగణన సర్వేలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు, పందులు, కుందేళ్లు, గుర్రాలు, బాతులు, పిల్లులు ఇలా మొత్తం 16 జంతు జాతులకు సంబంధించిన పశువుల లెక్కలు అధికారులు సేకరిస్తున్నారు. యజమానులు పెంచుకునే పశువులు, జంతువులే కాకుండా వీధి కుక్కలు, వీధి పశువుల లెక్కలు కూడా తీస్తున్నారు. సర్వేకు వైద్య అధికారులు సరిపోకపోవడంతో గోపాల మిత్రల సహాయాన్ని కూడా తీసుకుంటున్నారు. ఇంటింటికీ తిరిగి ఇంటి యజమాని పేరుతో పాటు పశువులు, జంతువులు వాటి రకాలు, సంఖ్యను నమోదు చేస్తున్నారు.

పశువైద్య ఉద్యోగులతో జేడీ సమీక్ష

రెండు నెలల కిందట మొదలై, నెమ్మదిగా సాగుతున్న పశు గణన సర్వేను వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. సర్వేను పూర్తి చేయడానికి మరో 56 రోజులు మాత్రమే గడువు ఉంది. ఐతే, సర్వేను వేగిరం చేసేందుకు శుక్రవారం జిల్లా కార్యాలయంలో పశువైద్య ఉద్యోగులతో ఆ శాఖ జేడీ జగన్నాథచారి సమావేశం నిర్వహించారు. వెనుకబడిన మండలాలపై సమీక్షించి పశుగణను త్వరగా పూర్తి చేయాలని ఉద్యోగులకు ఆదేశాలిచ్చారు. అలాగే లక్ష్యం మేరకు పశువులకు టీకాలను పూర్తి చేయాలని సూచించారు.



అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సావిత్రిబాయి కృషి



సన్మానం పొందిన మహిళా టీచర్లతో అదనపు కలెక్టర్ అంకిత్, అధికారులు

- అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే కృషి చేశారని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువుకొని ఉపాధ్యాయురాలు అయ్యారన్నారు. విద్యతోనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని గ్రహించిన సావిత్రిబాయి, సాటి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బాలికల పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. ఆ మహనీయురాలి స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం కృషి చేయాలని సూచించారు. సావిత్రిబాయి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయినులుగా ఎంపికైన సాలూర ఎంఈవో మంజూష, వేల్పూర్ ఎంఈవో రేణుక, సుద్దపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల పీడీ సంధ్యారాణి, నాగారం ఉర్దూ మీడియం రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన హలీమా బేగం, బాల్కొండ జ్యోతిబాపూలే బాలికల పాఠశాల ఉపాధ్యాయిని ఎల్ ఉమాదేవి, జూనియర్ లెక్చరర్ నూరున్నీసా బేగం, జాతీయ అవార్డు గ్రహీత విజయలక్ష్మి, రాష్ట్రస్థాయిలో అవార్డు పొందిన స్వరూపలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్ మధు, డీఎంహెచ్‌వో రాజశ్రీ, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్‌ జారీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో 2024–25 విద్యాసంవత్సరానికి గానూ పీహెచ్‌డీ ప్రవేశాలకు శుక్రవారం నోటిఫికేషన్‌ జారీ చేశారు. కేటగిరి–1 కింద జారీచేసిన నోటిఫికేషన్‌ ప్రకారం జేఆర్‌ఎఫ్‌ ఫెలోషిప్‌, ఇతర ఫెలోషిప్‌ అర్హత గల అభ్యర్థులు మాత్రమే పీహెచ్‌డీ కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో ఖాళీలు, ఇతర వివరాల కోసం తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వర్సిటీ ఉన్నతాధికారులు సూచించారు.

ఎన్‌పీఎస్‌ఎస్‌ యాప్‌పై శిక్షణ



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): జిల్లాకేంద్రంలోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం నేషనల్‌ పెస్ట్‌ సర్వేలెన్స్‌ సిస్టమ్‌ (ఎన్‌పీఎస్‌ఎస్‌) మొబైల్‌ యాప్‌ వినియోగంపై ప్రగతిశీల రైతులకు, వ్యవసాయాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌ నుంచి సెంట్రల్‌ ఇంటిగ్రేటెడ్‌ పెస్ట్‌ మేనేజ్‌మెంట్‌ సెంటర్‌ అధికారులు యాప్‌ వినియోగంపై ప్రొజెక్టర్‌ ద్వారా వారికి అవగాహన కల్పించారు. యాప్‌ ద్వారా రైతులు ఎలాంటి ఆలస్యం లేకుండా పంటల్లోని తెగుళ్లను సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. తెగుళ్లను నివారించడానికి వెంటనే సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. అధికారులు సునీత, వెంకటరెడ్డి, ఉదయ్‌శంకర్‌, సుధ, ఏఈవోలు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ విధించలేదు

వేల్పూర్‌: మండలంలోని పోచంపల్లి గ్రామంలో తాము ఎవరికీ సాంఘిక బహిష్కరణ విధించలేదని వీడీసీ సభ్యులు ఒక ప్రకటనలో వెల్లడించారు. గ్రామ పంచాయతీకి చెందిన భూములను విక్రయించామని, దానికి ఒప్పుకోని వారికి జరిమానా, సాంఘిక బహిష్కరణ విధించినట్లు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. గతంలో గ్రామంలో కొందరికి ఇందిరమ్మ ఇళ్ల స్థలాల కోసం భూమిని ఇచ్చారని, ఆ భూమికి ప్రభుత్వం నష్టపరిహారం కూడా ఇచ్చిందన్నారు. ఇళ్ల స్థలాలను ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో ఆ భూమిని అమ్మినవారే తిరిగి అక్రమించుకొని సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ కోరగా తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

మరువలేని ఆనంద క్షణాలు

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రత్యేక పోలీస్‌ 7వ బెటాలియన్‌లో మూడు జిల్లాలకు చెందిన పోలీస్‌ కానిస్టేబుళ్ల పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌ శుక్రవారం అట్టహాసంగా జరిగింది. పరేడ్‌ను తిలకించేందుకు కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు, బంధుమిత్రులు హాజరయ్యారు. పరేడ్‌ ముగిసిన తర్వాత శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో తమ జ్ఞాపకాన్ని పదిలపర్చుకున్నారు. ఆ మధుర క్షణాలను మొబైల్‌ ఫోన్లలో బంధించారు. అలాగే పలువురు 'సాక్షి'తో తమ అనుభవాలను పంచుకున్నారు.



బెటాలియన్‌లో ఇన్‌చార్జి సీపీ సింధుశర్మకు గౌరవ వందనం చేస్తున్న శిక్షణ పూర్తిచేసిన కానిస్టేబుళ్లు



కవాతు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు



శిక్షణ ఇచ్చిన బెటాలియన్‌ సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఇన్‌చార్జి సీపీ

పోలీస్‌ ఉద్యోగం గర్వంగా ఉంది..

మొదటి ప్రయత్నంలోనే పోలీస్‌ ఉద్యోగం సాధించి విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవడం గర్వంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు భార్య మౌనిక సహకారం మరువలేనిది. పోలీసుగా ప్రజలకు సేవలందించే అవకాశం కలిగింది.

– బండ ప్రదీప్‌గౌడ్‌, పెద్దమల్లారెడ్డి, కామారెడ్డి జిల్లా

లక్ష్యం నెరవేరింది



మాది వ్యవసాయ కుటుంబం. బీటెక్‌ పూర్తిచేయగా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేదే నా లక్ష్యం. కానిస్టేబుల్‌ నోటిఫికేషన్‌ రాగానే ప్రిపేరై, పరీక్ష రాశాను. ఉద్యోగం సాధించి ఏఆర్‌ కానిస్టేబుల్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నాను. దీంతో నా లక్ష్యం నెరవేరింది.

– సోమ్‌లాల్‌ నాయక్‌, దేవరకొండ, నల్గొండ

తల్లిదండ్రులకు అండగా ఉంటా



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పోలీసు ఉద్యోగం సాధించాను. మా అమ్మానాన్న బాబయ్య, లక్ష్మమ్మలకు అండగా ఉంటాను. పోలీసు శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరడానికి సిద్ధంగా ఉన్నాను. అంకితభావం, నీతినిజాయితీతో విధులు నిర్వర్తిస్తాను.

– ఈ.మహేష్‌, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి

సంతోషంగా ఉంది



పోలీస్‌ కానిస్టేబుల్‌గా ఎంపికైన అనంతరం బెటాలియన్‌లో ఇచ్చిన శిక్షణలో బెస్ట్‌ అవుట్‌డోర్‌, ఆల్‌రౌండర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. మా అమ్మా, నాన్న వ్యవసాయం చేసి మమ్మల్ని చదివించారు. పోలీసుగా ప్రజలకు సేవచేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది.

– బి.రవి, ముదేటిపల్లి తండా, మహబూబ్‌నగర్‌

ముడుపు విప్పేందుకు రండి

- సీఎం రేవంత్‌రెడ్డిని ఏర్గట్లకు ఆహ్వానించిన కాంగ్రెస్‌ నాయకులు



మోర్తాడ్‌: ఏర్గట్ల మండల కేంద్రంలో ప్రచారం చేసిన సందర్భంలో రేవంత్‌రెడ్డి సీఎం కావాలని ముడుపు కట్టామని, దానిని విప్పడానికి రావాలని కాంగ్రెస్‌ నేతలు ముఖ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో శుక్రవారం బా ల్కొండ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శివ స్నోల్ల శివకుమార్‌ ఆయనను కలిశారు. అప్పట్లో ముడుపు కట్టిన వివరాలు, పత్రికలలో వచ్చిన క్లిప్పింగ్‌లను సీఎంకు చూపించారు. గతంలో ఎన్టీఆర్‌, వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఏర్గట్లలో ప్రచారం చేసి సీఎం అయ్యారని, అదే బాటలో రేవంత్‌రెడ్డి కూడా సీఎంగా ఎంపికైన సెంటిమెంట్‌ అంశాన్ని ప్రస్తావించామని శివకుమార్‌ చెప్పారు. ఏర్గట్ల పర్యటన అంశం పరిశీలిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు శివకుమార్‌ తెలిపారు. మునిమానిక్యం అజయ్‌ పాల్గొన్నారు.

ధర్పల్లి హెచ్‌ఎంపై విచారణ

నిజామాబాద్‌ అర్బన్‌: ధర్పల్లి ఉన్నత పాఠ శాల హెచ్‌ఎంపై శుక్రవారం నిజామాబాద్‌ రూరల్‌ మండల విద్యాశాఖ అధికారి సేవ్లా విచారణ చేపట్టారు. పాఠశాలలో టీచర్ల మధ్య విభేదాలు ఉన్నాయి. అలాగే గ్రామ స్తులు సైతం హెచ్‌ఎంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్జేడీ ఆదేశాల మేరకు ఆయన పాఠశాలలో విచారణ చేపట్టారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

సిరికొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను ప్యానెల్‌ టీం సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లా నోడల్‌ అధికారి ప్రవీణ్‌ విద్యార్థులకు బోధిస్తున్న తీరును, రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పూలే జయంతి సందర్భంగా మహిళా టీచర్లను సన్మానించారు.

యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు వర్సిటీ పరిపాలనా భవనాన్ని ముట్టడించి నిరసన నిర్వహించారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. తెయూ మెయిన్‌ క్యాంపస్‌లో సుమారు 800 మంది విద్యార్థినులకు ఒకటే హాస్టల్‌ ఉందని దీంతో రూములు సరిపోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నూతన బాలికల హాస్టల్‌ నిర్మించాలని డిమాండ్‌ చేశారు. క్యాంపస్‌లో ఆడిటోరియం నిర్మాణం చేపట్టాలని, నాణ్యమైన విద్యతో పాటు ప్లేస్‌మెంట్స్‌, రీసెర్చ్‌ సౌకర్యాలను కల్పించాలన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్‌ యాదగిరిలు వచ్చి, వారి డిమాండ్లను తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు శివ, అమృతచారి, మోహన్‌, సాయికుమార్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వీసీకి సమస్యలను విన్నవిస్తున్న ఏబీవీపీ నేతలు

మళ్లీ మొరాయించిన ఎలక్ట్రిక్‌ బస్సు

ఖలీల్‌వాడి: ఆర్టీసీలోని ఎలక్ట్రికల్‌ బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. ఇటీవల నాగారం వద్ద బస్సు మొరాయించడంతో గంటపాటు ప్రయాణికులు వేచి ఉండాల్సి వచ్చింది. అలాగే శుక్రవారం మధ్యాహ్నం నిజామాబాద్‌ నుంచి బాన్సువాడకు బయలుదేరిన ఎలక్ట్రికల్‌ బస్సు ఎల్లమ్మగుట్ట చౌరస్తా వద్దకు చేరుకోగానే నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సు డ్రైవర్‌ అప్రమత్తమై ప్రయాణికులను కిందికి దింపేశారు. అనంతరం వారిని మరో బస్సు ద్వారా గమ్య స్థానానికి చేర్చారు. ఆర్టీసీ అధికారులు మెకానిక్‌లను రప్పించి బస్సుకు మరమ్మతులు చేయించారు.

బీఈడీ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ 2వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ థియరీ రీవాల్యుయేషన్‌ కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్‌ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్‌–2024 బీఈడీ పరీక్షలకు హాజరైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆమె తెలిపారు. ఫామ్‌కు రూ.25లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీవాల్యుయేషన్‌ ఒక్కో పేపర్‌కు రూ.500 ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

జిల్లా కోర్టులో న్యూఇయర్‌ వేడుకలు

ఖలీల్‌వాడి: జిల్లాకోర్టు ప్రాంగణంలోని పీపీ గంగారెడ్డి మెమోరియల్‌హాల్‌లో శుక్రవారం నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో న్యూ ఇయర్‌ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల హాజరై, బార్‌ ప్రతినిధులతో కలిసి కేక్‌ కట్‌ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో అందరికీ శుభాలే కలగాలని, గతంలో జరిగిన వాటిని మరిచి ప్రస్తుతం నూతనోత్తేజంతో పని చేయాలన్నారు. అదనపు జిల్లా జడ్జీలు ఆశాలత, శ్రీనివాస్‌, సీనియర్‌ సివిల్‌ జడ్జి శ్రీకాంత్‌ బాబు, జూనియర్‌ సివిల్‌ జడ్జిలు కుష్బు ఉపాధ్యాయ్‌, గోపికృష్ణ,హరి కుమార్‌, శ్రీనివాసరావు, బార్‌ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్‌గౌడ్‌, ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్‌ రావు, కార్యదర్శి దొన్పల్‌ సురేష్‌, కోశాధికారి దీపక్‌ న్యాయవాదులు పాల్గొన్నారు.



కేక్‌ కట్‌ చేస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి క్విజ్‌పోటీలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ డివిజన్‌ ప్రొహిబిషన్‌, ఎక్సైజ్‌ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నేడు ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా స్థాయి క్విజ్‌ పోటీలను నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎక్సైజ్‌ కమిషనర్‌ సోమిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడిలోగల రాజీవ్‌ గాంధీ ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కామారెడ్డి, నిజామాబాద్‌ జిల్లాలలోని సుమారు 70 పాఠశాలల నుంచి 550 మంది విద్యార్థులు ఈ పోటీలకు రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారన్నారు. కార్యక్రమానికి కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌, కాకతీయ సాండ్‌ బాక్స్‌ వ్యవస్థాపకుడు రాజురెడ్డి, డీఈవో అశోక్‌, అడిషనల్‌ డీసీపీ బస్వారెడ్డి, డాక్టర్‌ విశాల్‌ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు



ఇందల్వాయి: ఇందల్వాయి–ధర్పల్లి రోడ్డు మార్గంలో వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి పక్కనే ఉన్న వరి పొలాల్లోకి దూసుకెళ్లింది. వివరాలు ఇలా.. ఇందల్వాయికి చెందిన విఠల్‌ అనే వ్యక్తి గురువారం రాత్రి కారులో సిరికొండ నుంచి ఇందల్వాయికి వస్తుండగా ఎల్లారెడ్డిపల్లె శివారులో అడవి పందులు అడ్డువచ్చాయి. వాటిని తప్పించబోయి కారు పొలాల్లోకి దూసుకెళ్లింది.కారులోని విఠల్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ఖలీల్‌వాడి: నగరంలోని భగత్‌సింగ్‌ కాలనీలో నివాసం ఉండే చంద్రగిరి అశోక్‌ వ్యక్తికి చెందిన ఇల్లు ప్రమాదశాత్తు దగ్ధమైంది. వివరాలు ఇలా.. అశోక్‌ శుక్రవారం ఉదయం ఇంట్లో దేవుడికి దీపం వెలిగించి పనులకు వెళ్లాడు. అనంతరం ఇంట్లో నుంచి మంటలు రావడంతో స్థానికులు ఫైర్‌ ఇంజిన్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి అగ్నిమాపకసిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు.

పొలం వద్ద గొడవ.. ట్రాక్టర్‌ ఎక్కించి హత్యాయత్నం

బోధన్‌రూరల్‌: పొలం దమ్ము చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య తలెత్తిన గొడవలో ఓ వ్యక్తి పైకి మరో వ్యక్తి ట్రాక్టర్‌ ఎక్కించి హత్యకు యత్నించిన ఘటన బోధన్‌ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని పెగడపల్లి గ్రామ శివారులోనిపొలంలో లింగాబోయి అనే వ్యక్తి దమ్ము చేస్తున్నాడు. బాబాబోయి అనే వ్యక్తి పొలంలో బురద పడటంతో ఇరువురి మధ్య గొడవ తలెత్తింది. దీంతో లింగబోయి ట్రాక్టర్‌తో బాబాబోయిను గుద్ది, పైకి ఎక్కించాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాబాబోయిను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు లింగబోయిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

పిట్లం(జుక్కల్‌)/బాన్సువాడ రూరల్‌: బాన్సువాడ డివిజన్‌లోని బుడిమి గ్రామానికి చెందిన మ్యాతరి సాయిలు (57) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సాయిలుకు కొంతకాలంగా తన ఆరోగ్యం బాగుండటం లేదు. ఈక్రమంలో శుక్రవారం అతడు బొల్లాక్‌పల్లి గ్రామ శివారులోని మంజీరా బ్రిడ్జి మీద నుంచి నీటిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం అవుతోంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

మహిళ దారుణ హత్య

ఖలీల్‌వాడి: సారంగపూర్‌లోని వడ్డెరకాలనీకి చెందిన దుబ్బాక సాయమ్మ(68)ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు ఆరోటౌన్‌ ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. వడ్డెరకాలనీలో సాయమ్మ ఒంటరిగా నివాసం ఉంటుంది. భర్త కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఉదయం సాయమ్మను హత్య చేసినట్లు సమాచారం రావడంతో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యను చంపిన కేసులో జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా.. లింగంపేట మండలం సూరాయిపల్లి తండాకు చెందిన రమావత్‌ విజయ (28) 2021 ఫిబ్రవరి 28న హత్యకు గురైంది. ఆమె అన్న మలావత్‌ భాస్కర్‌ ఫిర్యాదు మేరకు లింగంపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. మృతురాలి భర్త రమేష్‌ తరచూ అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించేవాడనీ, హత్య జరిగిన రోజు ఆమెను తీవ్రంగా కొట్టడంతోనే చనిపోయినట్లు విచారణలో తేలింది. దీంతో రమేష్‌ను అరెస్ట్‌ చేయగా అప్పటి నుంచి కోర్టు విచారణ జరిగింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌ ఆర్‌ఆర్‌ వరప్రసాద్‌ నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

షెడ్డు ధ్వంసం కేసులో 9మంది రిమాండ్‌

కామారెడ్డి క్రైం: చర్చికి సంబంధించిన రేకుల షెడ్డును ధ్వంసం చేసిన విషయంలో 9 మందిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో ప్రార్థనలు చేయడానికి ఇటీవల ఓ చోట చర్చి నిర్మించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రెండు రోజుల క్రితం చర్చిని ధ్వంసం చేశారు. చర్చి ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రూరల్‌ సీఐ రామన్‌, దేవునిపల్లి ఎస్సై రాజు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో గ్రామానికి చెందిన 9మందిపై కేసు నమోదు చేసి రిమండ్‌కు పంపామన్నారు.

ఏడాదికి వెలుగు చూసిన హత్య

- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన వైనం
- రైలు ప్రమాదంగా నమ్మించేందుకు యత్నం
- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో విచారణ.. నిందితుల రిమాండ్‌

ఎడపల్లి(బోధన్‌): వివాహేతర సంబంధంపై ప్రశ్నించిన భర్తను ప్రియుడితో కలిసి హత్య చేసిందో భార్య. అనంతరం మృతదేహాన్ని పట్టాలపై పడుకోబెట్టి రైలు ప్రమాదంగా నమ్మించేందుకు యత్నించింది. ఏడాది క్రితం జరిగిన ఈ హత్య కేసులో తాజాగా పోలీసులు నలుగురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. ఎడపల్లి మండలం జైతాపూర్‌ గ్రామానికి చెందిన దుడ్డు సాయిలు 2024 జనవరి 8న రైలు పట్టాలపై మృతి చెంది ఉన్నాడు. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి, వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. కాగా సాయిలు భార్య చంద్రకళకు రాజలింగం అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయమై సాయిలు భార్యను మందలించాడు. దీంతో భర్త అడ్డు తొలగించుకోవాలని ఆమె భావించింది. జైతాపూర్‌కు చెందిన రాజలింగం, స్వరూప, బాపూనగర్‌కు చెందిన మనోజ్‌ సాయంతో హత్యకు ప్లాన్‌ వేసింది. దీంతో నలుగురు కలిసి దావత్‌ అని పిలిచి సాయిలును హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని పట్టాలపై పడుకోబెట్టారు. రైలు మృతదేహం పైనుంచి వెళ్లే వరకు అక్కడే ఉండి ఇంటికి చేరుకున్నారు. విచారణ చేపట్టగా నిందితులు నేరం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి


ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో పలువురు మృతిచెందారు. నందిపేట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, బాల్కొండ మండలంలో ఒకరు, డిచ్‌పల్లి మండలంలో ఒకరు మృత్యువాతపడ్డారు. అలాగే చెరువులో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు మరణించారు.

బాల్కొండ: మండలంలోని బస్సాపూర్‌ శివారులోగల జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఎస్సై నరేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్‌ మండలం నాగంపేట్‌ గ్రామానికి చెందిన భీమనొల్లా ప్రమీల(40) భర్తతో కలిసి బైక్‌పై బస్సాపూర్‌ వస్తుండగా వారిని బస్సాపూర్‌ శివారులో వెనుక నుంచి వేగంగా వచ్చిన స్కూటీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినదని వైద్యులు పేర్కొన్నారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కను తప్పించబోయి బైక్‌ అదుపుతప్పడంతో..

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం (బి) గ్రామం వద్ద రహదారిపై వేగంగా వెళ్తున్న బైక్‌కు కుక్క అడ్డురావడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న భర్తకు తీవ్ర గాయాలు కాగా, భార్య మృతిచెందింది. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలం రాంపూర్‌ గ్రామానికి చెందిన నడిపోల్ల సుబ్బయ్య తన భార్య లత (34)తో కలిసి బైక్‌పై నిజామాబాద్‌కు వెళుతున్నాడు. ధర్మారం(బి) గ్రామంలోని బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా సమీపంలో వీరి బైక్‌కు ఒక కుక్క అడ్డుగా రావడంతో దానిని తప్పించబోయి ఇద్దరూ కిందపడిపోయారు. ఈప్రమాదంలో లతకు తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కొద్ది సేపటికే మృతి చెందింది. మృతురాలి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని వ్యవసాయ కూలి..



ప్రమాదానికి కారణమైన కారు

నందిపేట్‌(ఆర్మూర్‌): నందిపేట్‌ మండల కేంద్రంలోని పలుగుట్ట సమీపంలో కారు ఢీకొనడంతో ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం ఏలూర్‌ జిల్లాకు చెందిన కొత్తపల్లి నాని అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యవసాయ కూలి పనుల నిమిత్తం నాని 20 రోజుల క్రితం బాద్గుణ గ్రామానికి వచ్చాడు. గురువారం రాత్రి కేదారీశ్వర ఆశ్రమంలో భోజనం చేసి నడుచుకుంటూ నందిపేటకు బయలు దేరాడు. ఇరిగేషన్‌ గెస్టుహౌజ్‌ వద్ద నానిని ఓ కారు వెనుకనుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారును డ్రైవర్‌ ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నందిపేటకు చెందిన బుద్ధ శివ కారుగా పోలీసులు గుర్తించారు. అతడే అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమయ్యాడని తేల్చారు. కారును స్టేషన్‌కు తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మహిళ..



అన్సి(ఫైల్‌)

ఎల్లారెడ్డి: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని రాంపూర్‌తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. రాంపూర్‌ తండాకు చెందిన మెగావత్‌ అన్సీ (42) ఆవులను మేపేందుకు గ్రామ శివారులోకి వెళ్లగా దాహం తీర్చుకునేందుకు చెరువులో దిగి నీటిని తాగుతుండగా కాలు జారి పడిపోయింది. దీంతో నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బహిర్భూమికి వెళ్లి ఒకరు..

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మాచారెడ్డి ఎస్సై అనిల్‌ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గోదూరి బాలయ్య(66) గురువారం రాత్రి బహిర్భూమికి వెళ్లగా, బండారి చెరువులో శుక్రవారం శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ యువతి..

బీబీపేట: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ యువతి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతిచెందింది. ఎస్సై ప్రభాకర్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన నిజ్జని స్నేహ (22) హైదరాబాద్‌లో ఉంటూ అగ్రికల్చర్‌ బీఎస్సీ చదివుతుంది. గత కొంతకాలంగా జాండిస్‌తో బాధపడుతూ ఉండేది. గత నెల 26న బీబీపేటకు వచ్చిన ఆమె గుర్తుతెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందిందన్నారు. మృతురాలి నానమ్మ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైరస్‌ కారణంగానే కోళ్ల మృతి?



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండలంలోని గంగాసముందర్‌లో మూడు రోజుల క్రితం యాభైకి పైగా నాటు కోళ్లు, ఒక మేక పిల్లల మృతి చెందిన ఘనటపై మండల పశువైద్య అధికారి శ్రీకాంత్‌ శుక్రవారం విచారణ జరిపారు. గ్రామానికి వెళ్లి కోళ్ల పెంపకందార్లతో మాట్లాడి, చనిపోయిన కోళ్లను పరిశీలించారు. మొదటి రోజే కాకుండా మరుసటి రోజు కూడా నాలుగైదు కోళ్లు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. చనిపోయిన కోళ్ల నుంచి శాంపిళ్లను సేకరించి నిజామాబాద్‌ పశువైద్య ల్యాబ్‌కు పంపించామని అధికారి పేర్కొన్నారు. వాటి మరణానికి విషాహారమేనని కచ్చితంగా చెప్పలేమని, నిమోనియా లాంటి వైరస్‌ సోకడం వలనే మరణించి ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇంకా అనుమానం ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేసి పెంపకందారులే స్వయంగా కోళ్ల శాంపిళ్లను హైదరాబాద్‌కు తీసుకెళ్లి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఐతే, బాధిత వ్యక్తులు మాత్రం తమ కోళ్లపై విష ప్రయోగం జరిగిందని ఆరోపిస్తున్నారు.

కంటెయినర్‌లో చెలరేగిన మంటలు



కామారెడ్డి క్రైం: టేక్రియాల్‌ బైపాస్‌ వద్ద జాతీయ రహదారిపై పాత ఎలక్ట్రానిక్‌ వస్తువుల లోడ్‌తో వెళ్తున్న ఓ కంటెయినర్‌లో శుక్రవారం వేకువజామున ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. సదరు కంటెయినర్‌ హైదరాబాద్‌ నుంచి ఢిల్లీకి వెళుతున్నట్లు తెలిసింది. మంటలు చెలరేగగానే డ్రైవర్‌ అప్రమత్తమై రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపారు. పక్కనే పెట్రోల్‌ బంక్‌ ఉండటంతో బంక్‌ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపకసిబ్బంది ఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పారు. కంటెయినర్‌తో పాటు అందులో ఉన్న వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.8లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు భావిస్తున్నారు.